

నందివాహనంపై ఆదిదంపతులు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆది దంపతులు నంది వాహనంపై ఊరేగారు. గంగా పార్వతీ సమేత మల్లేశ్వర ఉత్సవమూర్తులను నందివాహనంపై ఉంచి ఈవో రామారావు తదితరులు ఊరేగింపుగా సాగారు. ఈ ఉత్సవం వన్‌టౌన్ వీధుల మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంది. కాగా, చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 5.55 గంటలకు శ్రీదుర్గామల్లేశ్వరుల గిరి ప్రదక్షిణ జరగనుంది. - వన్‌టౌన్

కోలాహలంగా..



పెడనలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్



అవనిగడ్డలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్. చిత్రంలో మచిలీపట్నం పార్లమెంట్ కూటమి అభ్యర్థి బాలశౌరి, టీడీపీ నాయకుడు కొనకళ్ల నారాయణ

నామినేషన్ల స్వీకరణ సోమవారం సందడిగా సాగింది. మంచిరోజు కావడంతో జిల్లా మొత్తంగా 31 నామినేషన్లు దాఖలయ్యాయి. ర్యాలీల హోరు, ప్రచారాల జోరుతో జిల్లా అంతటా పండుగ వాతావరణం కనిపించింది.

పాత స్థానాలు పదిలం

'పది' ఫలితాల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు పాతస్థానాలనే పదిల పరుచుకున్నాయి. గత ఏడాది కృష్ణా 11, ఎన్టీఆర్ 13 స్థానాల్లో నిలవగా, ఈ ఏడాది కూడా అవే స్థానాలు దక్కించుకున్నాయి. ఉత్తీర్ణతా శాతంలో మాత్రం భారీ పెరుగుదల కనిపించింది. కృష్ణాలో 90.05 శాతం, ఎన్టీఆర్‌లో 88.76 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏటా మాదిరిగానే ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు.



ఫలితాలను విడుదల చేస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

పది ఫలితాల్లో కృష్ణాకు 11, ఎన్టీఆర్‌కు 13వ స్థానం

గత ఏడాది కూడా ఇవే స్థానాలు

- ఉత్తీర్ణతా శాతంలో మాత్రం భారీ పెరుగుదల
- రెండు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి
- కృష్ణాజిల్లాలో 90.05 శాతం ఉత్తీర్ణత
- ఎన్టీఆర్ జిల్లాలో 88.76 శాతం ఉత్తీర్ణత

విజయవాడ/మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పది ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లాలో అమ్మాయిలు హవా చాటారు. జిల్లావ్యాప్తంగా 88.76 శాతం ఉత్తీర్ణత నమోదై.. రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. మొత్తం 27,899 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 24,763 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 14,401 మంది పరీక్షలకు హాజరుకాగా, 12,420 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 13,498 మంది పరీక్షలు రాయగా, 12,343 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 86.24 శాతం, బాలికలు 91.44 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. గడిచిన ఏడాది జిల్లా 13వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాదీ ఆ స్థానాన్నే పదిలం చేసుకుంది. గడిచిన ఏడాది జిల్లా ఉత్తీర్ణత శాతం 73.07గా ఉండగా, ఈ ఏడాది 88.76 శాతానికి పెరిగింది. ఈ ఏడాది 15.69 శాతం ఉత్తీర్ణత పెరగడం గమనార్హం. మొదటి డివిజన్‌లో 20,541 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో డివిజన్‌లో 3,007 మంది, మూడో డివిజన్‌లో 1,215 మంది ఉత్తీర్ణతను సాధించారు.

వత్సవాయి మండలం ఫస్ట్

ఎన్టీఆర్ జిల్లాలో నమోదైన ఉత్తీర్ణతలో వత్సవాయి మండలం అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించింది. ఈ మండలంలో 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తర్వాత స్థానంలో జగ్గయ్యపేట మండలం ఉంది. ఈ మండలంలో 93.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 92.43 శాతం ఉత్తీర్ణతతో విజయవాడ తూర్పు తృతీయ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత గంపలగూడెం 92.24, విజయవాడ సెంట్రల్ 91.34, చందర్లపాడు 90.98, విజయవాడ ఉత్తరం 90.00, విజయవాడ పశ్చిమ 89.14, తిరువూరు 89.08, పెనుగంచిప్రోలు 87.75, వీరులపాడు 87.50, నందిగామ 87.42, రెడ్డిగూడెం 86.52, ఇబ్రహీంపట్నం 86.35, ఎ.కొండూరు 86.29, విస్సన్నపేట 84.86, కంచికచర్ల 84.65, మైలవరం 82.45, జి.కొండూరు 80.23 శాతం, రెడ్డిగూడెం 56.52 ఉత్తీర్ణత నమోదు చేశాయి.

కృష్ణాజిల్లాలో..

పది ఫలితాల్లో కృష్ణాజిల్లా 90.05 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 21,112 మంది పరీక్ష రాయగా, 19,011 మంది ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 19,670 మంది పరీక్షలు రాయగా, 14,688 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది ఉత్తీర్ణతా శాతం 74.67గా ఉన్నా జిల్లా 11వ స్థానంలోనే నిలిచింది. కాగా, ఈ ఏడాది బాలికలే పైచేయి సాధించారు. బాలురు 11,138 మంది హాజరు కాగా, 9,833 మంది ఉత్తీర్ణులై 88.28 శాతం నమోదు చేశారు. బాలికలు 9,974 మంది హాజరు కాగా, 9,178 మంది ఉత్తీర్ణులై 92.02 శాతాన్ని నమోదు చేశారు. దీంతో బాలుర కంటే బాలికలే 3.74 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ స్థానంలో మచిలీపట్నం డివిజన్

జిల్లాలో 54 ఉన్నత పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. గుడివాడ డివిజన్‌లో 114 పాఠశాలల్లో 6,379 మందికి 5,736 మంది పాసయ్యారు. 89.92 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఉయ్యూరు డివిజన్‌లో 102 ఉన్నత పాఠశాలల్లో 7,174 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 6,449 మంది ఉత్తీర్ణులై 89.89 శాతం సాధించారు. మచిలీపట్నం డివిజన్‌లోని 162 పాఠశాలల్లో 7,559 మందికి.. 6,826 మంది ఉత్తీర్ణత సాధించి 90.30 శాతం నమోదు చేశారు. మచిలీపట్నం డివిజన్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లాలో మొదటి డివిజన్‌లో 15,396 మంది, రెండో డివిజన్‌లో 2,381 మంది, మూడో డివిజన్‌లో 1,234 మంది ఉత్తీర్ణులైనట్లు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. గుడివాడ ఏకేటీపీ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థిని అల్లంపల్లి భానుప్రసన్న 600కు 590 మార్కులు సాధించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని తుమ్మల అఖిల 600కు 588 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, కోడూరు మండలం స్వతంత్రపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వై.ఉజ్వల 600కు 586 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. జిల్లాలో 575 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 904 మంది ఉన్నారన్నారు. ఈ ఏడాది పది ఫలితాల్లో ర్యాంకు పెరగలేదు కానీ, ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగిందని డీఈవో తెలిపారు.

ఆయన రాష్ట్రంలోనే కాదు. దేశంలోనే పేరున్న కేన్సర్ వైద్యుల్లో ఒకరు. ఆయన తండ్రి దేవుడి మంత్రిగా పేరొందిన వ్యక్తి. ఆయన ఇమేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు వైసీపీ పెద్దలు స్కెచ్ వేశారు. ముగ్గులోకి దింపారు. తొలుత అవనిగడ్డ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించారు. వైసీపీ పెద్దల మాటలు నమ్మి అన్యమనస్కంగానే రాజకీయాల్లోకి వచ్చిన ఆయనకు కొద్దిరోజులకే పరిస్థితి అర్థమయ్యేలా చేశారు వైసీపీ నాయకులు. తొలుత అవనిగడ్డ అసెంబ్లీ అని ఆ తర్వాత తూచ్.. అది మీ స్థాయి కాదు మచిలీపట్నం పార్లమెంటుకు పోటీ చేయండి అంటూ టికెట్ ఇచ్చారు. సరే అని ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయనకు ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థులు మొదలు.. గ్రామస్థాయి నాయకుల వరకు ప్రతి ఒక్కరూ చుక్కలు చూపిస్తున్నారు. ఆయన మరెవరో కాదు.. మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్..!



ఒంటరి పోరాటం

సోమవారం నాటి నామినేషన్‌కు ముఖ్య నేతలు దూరం

ఏకాకిలా మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

- ఎంపీ అభ్యర్థిత్వాన్ని లైట్ తీసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు
- చుక్కలు చూపిస్తున్న సొంత పార్టీ నాయకులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి వైసీపీ తరపున పోటీ చేస్తున్న సింహాద్రి చంద్రశేఖర్ వచ్చింది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచే అయినా ఆయనకు రాజకీయాలు మాత్రం పూర్తిగా వంటబట్టలేదు. ఆయన తండ్రి సింహాద్రి సత్యనారాయణ సైతం రాజకీయాల్లో ఉన్నంతకాలం నిజాయితీగా, ముక్కుసూటిగా వ్యవహరించేవారు. 2010లో సింహాద్రి సత్యనారాయణ మృతిచెందారు. తండ్రి ఉన్నప్పుడు, ఆయన తదనంతరం కూడా తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకునే అవకాశం ఉన్నా ఏనాడూ చంద్రశేఖర్ ఆ ప్రయత్నాలు చేయలేదు. అలాంటిది ఈసారి వైసీపీ పెద్దల మాటలు నమ్మి రాజకీయాల్లోకి దిగారు. వైసీపీ ఆడుతున్న రాజకీయ క్రీడలో పావుగా మారారు.

మార్పులు చేర్పులతో..

దివిసీమలో సింహాద్రి సత్యనారాయణ కుటుంబానికి మంచి పేరుంది. ఆ మంచి పేరును వాడుకునేందుకు వైసీపీ పెద్దలు పావులు కదిపారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సింహాద్రి రమేశ్ అవినీతి అక్రమాలతో విసిగిపోయిన అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు ఈ ఎన్నికల్లో ఆయన్ను ఓడిస్తారని వైసీపీ పెద్దల భావించారు. దీంతో ఆయన్ను మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయించాలని నిర్ణయించారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి చంద్రశేఖర్‌ను బరిలో దింపాలని భావించారు. ఆది నుంచి అన్యమనస్కంగా ఉన్న చంద్రశేఖర్ తాను పోటీ చేయబోనని, తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈలోగా మచిలీపట్నం ఎంపీగా రమేశ్ సామర్థ్యం సరిపోదన్న రిపోర్టులు రావడంతో వైసీపీ పెద్దలు పునరాలోచన చేశారు. ఎంపీ అభ్యర్థిగా సరైన వ్యక్తి లేకపోతే ఆ ప్రభావం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడుతుందని భావించి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న చంద్రశేఖర్‌ను ఎంపీ అభ్యర్థిగా, రమేశ్‌ను తిరిగి అవనిగడ్డ నుంచే పోటీ చేయించేందుకు నిర్ణయించారు. ఈ పరిణామాలను జీర్ణించుకోవడానికి చంద్రశేఖర్‌కు సమయం ఇవ్వకుండా ఆయన పేరును ప్రకటించేశారు. దీంతో తాడోపేడో తేల్చుకునేందుకు చంద్రశేఖర్ సిద్ధమయ్యారు.

కలిసి రారు.. కలుపుకొని పోరు..

మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల సహకారం ఉంటేనే ఎంపీ అభ్యర్థి నెగ్గుకురాగలరు. కానీ, ఒకరిద్దరు మినహా పార్లమెంట్ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యే అభ్యర్థులందరూ చంద్రశేఖర్‌ను లైట్ తీసుకుంటున్నారు. కొందరు అభ్యర్థులు ఆయన్ను తమ నియోజకవర్గంలో పర్యటించమని కూడా కోరడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమవారం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా చంద్రశేఖర్ నామినేషన్ వేశారు. గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులెవరూ ఈ కార్యక్రమానికి రాలేదు. సాధారణంగా ఎంపీ అభ్యర్థి నామినేషన్ వేస్తున్నారంటే ఆ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులంతా హాజరవుతారు. భారీ ఎత్తున జనసమీకరణ చేస్తారు. కానీ, సోమవారం చంద్రశేఖర్ నామినేషన్ సమయంలో ఆ హడావిడి కనిపించలేదు. కేవలం అవనిగడ్డ నుంచి మాత్రమే ఆయన అభిమానులు తరలివచ్చారు. అభ్యర్థుల నుంచి సహాయ నిరాకరణ ఒక ఎత్తయితే, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి వైసీపీ నాయకుల నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోవడం మరో ఎత్తులా ఉందని చంద్రశేఖర్ సన్నిహితులు వాపోతున్నారు. ఫలానా గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బాలశౌరి గ్రామపెద్దలకు ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు ఇచ్చారని, మనం ఇవ్వకపోతే కేడర్ తిరిగే పరిస్థితి లేదని బెదిరింపులతో కూడిన హెచ్చరికలు రోజూ పదుల సంఖ్యలో వస్తున్నాయని సమాచారం. ప్రార్థనా మందిరాలకు ఆర్థికసాయం చేయాలని ఓ నాయకుడు.. గ్రామంలో యువకులకు క్రీడా పరికరాలు ఇవ్వాలని మరో నాయకుడు ఇలా రకరకాల ప్రతిపాదనలతో ఎంపీ కార్యాలయంలో వాలిపోతున్నారు. వీటన్నింటినీ జీర్ణించుకోవడం కష్టంగా ఉందని చంద్రశేఖర్ సన్నిహితులు పేర్కొన్నారు. ఇంకా రెండు వారాలకు పైగా ప్రచారం ఎలా నిర్వహిస్తారోనని వారు వ్యాఖ్యానించడం గమనార్హం.

మాటల్లో కోతలు.. చేతల్లో చుక్కలు..



ఉత్తుత్తి హామీలతో ముస్లింలను మోసం చేసిన గుడివాడ ఎమ్మెల్యే

- షాదీఖానా హామీ తూచ్..!
- వదిలేసిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- ఈద్గా నిర్మాణం ఊసే లేదు..
- అంజుమన్ భవనానికి రంగుపూసి కలరింగ్
- వక్ఫ్ ఆస్తులపై కన్ను
- ఐదేళ్ల పాలన తీరిదీ..

జన కేతనంలో..



మార్కెట్ యార్డు డైరెక్టర్లతో లక్ష్మోజీ (సర్కిల్‌లో)

సెలవు పెట్టి స్వామి సేవలో..

ఎమ్మెల్యే కొడాలి నాని పీఏ లక్ష్మోజీ భక్తిప్రపత్తులు

- పౌరసరఫరాల శాఖలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు
- సెలవు పెట్టి మరీ.. నాని ఎన్నికల పనుల్లో..
- వైసీపీ మిత్రులతో మున్సిపల్ కార్యాలయం ఎదుటే తిష్ట
- 'మేమంతా సిద్ధం' సభలో మాస్కులతో ప్రభుత్వ ఉద్యోగులు..?

అధికార పార్టీ అనో.. లేక వీర విధేయత చూపాలనో.. తెలియదు కానీ కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ సేవలో తరిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్న ఈ సమయంలో పార్టీ ప్రచారాలు, కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా.. దీర్ఘకాలిక సెలవు పెట్టి మరీ స్వామిభక్తి చాటుకుంటున్నారు. గుడివాడలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుండటం, సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' సభలో మాస్కులు ధరించి పాల్గొనడం వంటి ఘటనలే ఇందుకు నిదర్శనం.

గుడివాడ : ఐదేళ్లుగా వైసీపీ నాయకులతో ఉన్న సావాసం మరువలేక, మాజీ మంత్రితో ఉన్న అనుబంధం వీడలేక ప్రభుత్వ ఉద్యోగి ఒక్కరూ తెగ సతమతమవుతున్నారు. అందుకే దీర్ఘకాలిక సెలవు పెట్టి మరీ పగటిపూట వైసీపీ నాయకులతో, రాత్రి మాజీ స్వామి సేవలో తరిస్తున్నారు. ఆయన ఎవరో కాదు మాజీ మంత్రి కొడాలి నాని పీఏ ఆచంట లక్ష్మోజీ.

అన్నీ తానై..

రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి నేటి వరకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి పీఏగా అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆచంట లక్ష్మోజీ వ్యవహరిస్తున్నారు. అన్నీ తానై నడిపిస్తున్నారు. తన సొంత మనిషి కావడంతో మంత్రిగా పనిచేసిన సమయంలో.. రెవెన్యూ ఉద్యోగిగా ఉన్న లక్ష్మోజీని పౌరసరఫరాల శాఖలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా నియామకం ఇచ్చుకున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను సైతం బెదిరించే స్థాయికి సదరు లక్ష్మోజీ ఎదిగాడంటే దానికి వెనుక ఎమ్మెల్యే కొడాలి నాని ఉన్నాడనే ధీమానే కారణం.

దీర్ఘకాలిక సెలవు మంజూరు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పౌరసరఫరాల శాఖకు ఆయన సరెండర్ అయ్యారు. వెంటనే దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ఆయన అడిగిందే తడవుగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సెలవు మంజూరు చేశారు. దీని వెనుక మాజీమంత్రి కొడాలి నాని సిఫారసు ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో లక్ష్మోజీకి లైన్ క్లియర్ అయ్యింది. అధికారికంగా సెలవుపై ఉండటంతో అడిగేవారు, అడ్డూ అదుపూ లేదనుకున్నారు. పగలంతా వైసీపీలోని మిత్రులతో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు డైరెక్టర్ మురళీకృష్ణకు చెందిన కూరగాయల షాపు వద్ద గడుపుతున్నారు. రాత్రికి మాజీ మంత్రి సేవలో తరిస్తున్నారు. నాని నామినేషన్ పత్రాలను సిద్ధం చేసే ప్రక్రియను కూడా ఆయనే దగ్గరుండి చూసుకున్నారని సమాచారం. నానీకి చేదోడు వాదోడుగా ఉంటూ వ్యవహారాలను చక్కబెడుతున్నట్లు వైసీపీ నాయకులే బహిరంగంగా చెప్పుకొంటున్నారు.

'మేమంతా సిద్ధం' సభలో..

ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి జగన్ గుడివాడలో చేపట్టిన 'మేమంతా సిద్ధం' సభకు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు హాజరైనట్లు సమాచారం. ఎమ్మెల్యే నానీతో ఉన్న సాన్నిహిత్యంతో ముఖానికి మాస్కులను పెట్టుకుని ఈ సభకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ బహిరంగంగా వైసీపీ నాయకులతో అంటకాగుతూ, వారి సేవలో తరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.


మైలవరంలో ఆర్వోకు నామినేషన్ పత్రాలు ఇస్తున్న వసంత


ఆర్డీవోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సౌమ్య


నామినేషన్ పత్రాలు ఇస్తున్న బుద్ధప్రసాద్


నామినేషన్ పత్రాలు ఇస్తున్న గద్దె రామ్మోహన్


నామినేషన్ పత్రాలు ఇస్తున్న కొలికపూడి శ్రీనివాసరావు

పొలిటికల్ హీట్


నామినేషన్ వేసేందుకు ఇబ్రహీంపట్నం వద్ద ర్యాలీగా వెళుతున్న మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత

- రెండు జిల్లాల్లో రికార్డ్ బ్రేక్ నామినేషన్లు
- ఎన్టీఆర్ జిల్లాలో గరిష్ఠంగా 38, కృష్ణాలో 31 దాఖలు
- రిజిస్టర్డ్ పార్టీల తరపున కొనసాగుతున్న నామినేషన్లు
- స్వతంత్ర అభ్యర్థులుగా భారీ సంఖ్యలో
- ర్యాలీలు, ప్రదర్శనలతో హోరెత్తిన రహదారులు

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎన్నికల వేడి రాజుకుంటోంది.. ఇప్పటి వరకు మందకొడిగా ఉన్న అభ్యర్థుల ప్రచారం నామినేషన్ల ఘట్టంతో గ్రామాల్లో, పట్టణాల్లో 'పొలిటికల్ హీట్' పుట్టిస్తోంది. మండే ఎండలను సైతం లెక్కచేయక పార్టీల అభ్యర్థులు ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు తమ నేతలపై పూల వానలు కురిపిస్తూ.. గజమాలలతో స్వాగతిస్తు.. రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల సమరంలో విజయ సంకేతాలిస్తూ భరోసా కల్పిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా నామినేషన్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. సోమవారం నాలుగో రోజున రికార్డుస్థాయిలో 38 నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు నామినేషన్లు దాఖలు చేయగా.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 32 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున అత్యధికంగా నామినేషన్లు పడ్డాయి. అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ తరపున మొత్తం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు నామినేషన్లు, అసెంబ్లీ నియోజకవర్గాల తరపున నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ల జోష్..

ప్రధాన పార్టీల అభ్యర్థులనుంచి రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు రంగంలోకి దిగుతున్నారు. ఈసారి ప్రతి నియోజకవర్గానికి రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పురుషలు, మహిళలు పెద్దసంఖ్యలో నామినేషన్లు వేస్తున్నారు. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలలో చైతన్యం.. స్వతంత్ర అభ్యర్థుల పోటీ.. రాజకీయాల్లో మార్పులకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

● విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఆరు నామినేషన్లు పడ్డాయి. వైఎస్సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత ఒక సెట్ నామినేషన్‌ను ఆర్వో, కలెక్టర్ ఢిల్లీరావుకు సమర్పించారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సయ్యద్ కరిమున్నీసా, ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అభ్యర్థిగా ఎన్.దశరథరామిరెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా సీహెచ్ గంగాధర గాంధీ, స్వతంత్ర అభ్యర్థిగా డి.మల్లిఖార్జునరావు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ తరపున షేక్ మహమూద్ నామినేషన్ దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మోహన్ డి.ప్రసాద్, బహుజన సమాజ్ వాదీ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థిగా మద్దిరాల వినోద్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా శ్రీరామ్ నాగమల్లేశ్వరరావు, ఈట్ల భవాని పొప్పూరి అశోక్‌లు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ తరపున వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కె.శివశంకర్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా శ్రీధర దక్షిణామూర్తి, ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి అభ్యర్థిగా జి.ఫణిరాజ్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎం.ప్రశాంత్ కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా బొప్పన రాఘవేంద్రరావు, డి.సుభాషిణిలు ఒక్క సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గద్దె రామమోహన్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణి గద్దె అనూరాధ నామినేషన్ వేశారు. వైసీపీ తరపున కోగంటి సుధీర రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్ అభ్యర్థిగా జి.వెంకట రెడ్డి, తెలుగు రాజాధికార సమితి పార్టీ అభ్యర్థిగా వై.వినయ్‌కుమార్, నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థిగా జె.అనీల్ కుమార్‌లు ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● మైలవరం నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున వసంత క్రిష్ణ ప్రసాద్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. వసంత శిరీష ఒక సెట్టు, వేములపల్లి పృథ్వీ ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సీ) అభ్యర్థులుగా బొర్రా కిరణ్, అక్కల నాగేంద్ర ప్రసాద్‌లు ఒక్కో సెట్ నామినేషన్ వేశారు.

నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తంగిరాల సౌమ్య ఒక సెట్టు నామినేషన్‌ను దాఖలు చేశారు.

● తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కొలికలపూడి శ్రీనివాసరావు ఒక సెట్టు, జనవాహిని పార్టీ అభ్యర్థిగా బి.నాగరాజు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

● జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ తరపున సామినేని విమల, స్వతంత్ర అభ్యర్థులుగా జెఅహరోన్, ఎం.ఫ్రాన్సిస్, ఐ.వెంకటేశ్వర్లు ఒక్కో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కె.మధు నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు.

కృష్ణా జిల్లాలో 31 నామినేషన్లు దాఖలు

మచిలీపట్నం, ఏప్రిల్ 22 : కృష్ణాజిల్లాలో నాల్గవ రోజైన సోమవారం 31 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు వైసీపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర రావు నామినేషన్ దాఖలు చేశారు. పార్లమెంటు నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గూడవల్లి వెంకట కేదారేశ్వర రావు, బహుజన సమాజ్ పార్టీ తరపున దేవరపల్లి దేవమణి నామినేషన్ దాఖలు చేశారు. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కలపర్తి భాస్కర రావు, స్వతంత్ర అభ్యర్థిగా కర్రిపోలు శ్రీనివాసరావు నామినేషన్ను దాఖలు చేశారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా వెనిగండ్ల రాము నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), వైసీపీ అభ్యర్థిగా కొడాలి నాగేశ్వరరావు(చిన్ని)లు రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా నల్లగంచు వెంకట రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా రేమల్లి నీలకాంత్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా అల్లూరి హేమంత్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్, కాగిత శిరీషలు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా రాజులపాటి జమదగ్ని, సేనాపతి గోపిలు, కాంగ్రెస్ పార్టీ తరపున శొంతి నాగరాజు, బహుజన సమాజ్ పార్టీ తరపున ఈడే కాశీ విశ్వేశ్వరరావులు నామినేషన్లు దాఖలు చేశారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా పేర్ని వాసు(కిట్టు), బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సౌదాడ బాలాజీ, స్వతంత్ర అభ్యర్థిగా చింతపల్లి మనోహర్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా కోన నాగార్జునలు నామినేషన్లు దాఖలు చేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పామర్రు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్, కైలే జ్ఞానమణి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా రాయపరపు బాబూ రాజేంద్రప్రసాద్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. పెనమలూరు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థులుగా వల్లపాలెం కనక దుర్గారావు, గోగం రాము, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా సోము మహేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు.



లక్ష్మీపురంలో సీజ్ చేసిన ట్రాక్టర్లతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది

మట్టి అక్రమ రవాణాకు బ్రేక్

- నాలుగు ట్రాక్టర్లు సీజ్, జరిమానా

కృత్తివెన్ను, ఏప్రిల్ 22 : మండలంలో మట్టి అక్రమ రవాణాకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. కొంతకాలంగా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ తోలకాలపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'తోలుకో.. తవ్వుకో..' కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు, పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి స్పందించారు. తక్షణమే మట్టి తోలకాలను నిలుపుదల చేసి, పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ట్రాక్టర్లు సీజ్ చేసి, జరిమానాలు విధించారు. అనుమతి లేకుండా తోలకాలు జరిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల పరిధిలోని జాతీయ రహదారి పొడవున వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి, మెరక పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులు, అధికార పార్టీ నేతల అండతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ విచ్చలవిడి మట్టి మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో పాటు పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకట రమణ స్పందించారు. తక్షణమే మట్టి తోలకాలపై పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు 1500 చొప్పున రూ.6 వేలు జరిమాన విధించారు. అనుమతి లేకుండా మట్టి తోలకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

కోలాహలంగా మండలి నామినేషన్

అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సోమవారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. దివి ప్రాంతంలోని ఆరుమండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు వెంటరాగా, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మండలి సతీమణి విజయలక్ష్మితో కలిసి అవనిగడ్డలోని సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించి భారీ ర్యాలీగా తరలివెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో రెండు సెట్ల నామినేషన్ వేశారు. ర్యాలీలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ నేతలు దిరిశం బాలకోటయ్య, మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు. మండలి బుద్ధప్రసాద్ నామినేషన్ సందర్భంగా నియోజకవర్గంలో ఆరు మండలాల నుంచి వేలాది సంఖ్యలో కార్యకర్తలు అవనిగడ్డకు తరలివచ్చి భారీ ర్యాలీ నిర్వహించారు. తీర ప్రాంత మత్స్యకార గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మత్స్యకారులు హాజరయ్యారు.

ఆనందోత్సాహాల మధ్య కాగిత..



పెడన : వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య పెడన అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా కాగిత కృష్ణప్రసాద్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి బాలశౌరి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, సాదరబోయిన ఏడుకొండలు, బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్ తదితరులతో కలిసి ర్యాలీగా ఆర్వో కార్యాలయానికి చేరుకుని పి.వెంకటరమణకు నామినేషన్ పత్రాలు సమర్పించారు.


అగ్నికుల క్షత్రియులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బుద్ధప్రసాద్; బాలశౌరి

అగ్నికుల క్షత్రియుల సమస్యల పరిష్కారానికి కృషి

- బాలశౌరి

అవనిగడ్డ, ఏప్రిల్ 22 : అగ్నికుల క్షత్రియ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తామని అవనిగడ్డ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు మండలి బుద్ధప్రసాద్, వల్లభనేని బాలశౌరిలు హామీ ఇచ్చారు. సోమవారం అవనిగడ్డలోని ఏఎస్ఆర్ కళ్యాణ మండపంలో అవనిగడ్డ నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం జరిగింది. మండలి బుద్ధప్రసాద్, బాలశౌరిలు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి వారి మద్దతు కోరారు.

టీడీపీలోకి వైసీపీ ఎస్సీ, బీసీ మైనార్టీ నాయకులు


టీడీపీలో చేరిన బీసీ నేత దారం

గుడివాడ, ఏప్రిల్ 22 : అధికార వైసీపీ నుంచి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం ఎస్సీ, బీసీ, మైనార్టీ నాయకులు, యువత టీడీపీకి జైకొట్టారు. స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో కాటూరి జాన్ శ్యామ్యూల్, దారం నరసింహారావు, కర్నాటి రాంబాబులు టీడీపీ కండువా కప్పుకున్నారు. స్థానిక 12వ వార్డులో షేక్ షబ్బీర్ నేతృత్వంలో 80మంది యువత, మైనార్టీ పెద్దలు, మహిళలు వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నామినేషన్లు..

నీరాజనాలు.. గజమాలలతో ఘన స్వాగతాలు

మైలవరం/ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 22 : బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అశేష జనసందోహం మధ్య అట్టహాసంగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఐతవరం నుంచి ఉదయం బయలు దేరి పరిటాల అభయాంజనేస్వామి అలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లిన ఆయనకు మూలపాడు, జూపూడి, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు వై.జంక్షన్ వద్ద అపూర్వ స్వాగతాలు లభించాయి. దొనబండలో మండల అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ), మూలపాడులో గరికపాటి శ్రీనివాసరావు, కాకి నాగరాజుల ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ర్యాలీలో విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బీజేపీ నేత నూతులపాటి బాలకోటేశ్వరరావు, జనసేన నేత అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ)లు పాల్గొన్నారు.

వసంతను అడ్డుకున్న పోలీసులు

నామినేషన్‌కు ముహూర్త సమయం మించిపోతుండటంతో మైలవరం ఎల్బీఆర్సీఈ రింగ్ నుంచి ఆయన కార్యకర్త మోటార్ బైక్‌పై ఆర్వో కార్యాలయానికి వెళుతుండగా రహదారిపై విధుల్లో ఉన్న పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఎట్టకేలకు 11.55 గంటలకు ఆయన భార్య శిరీష, కుమారుడు ధీమంత్ సాయితో కలిసి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, కె.విజయబాబు, ఉయ్యూరు వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. వసంత నామినేషన్‌కు అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ క్యాడర్‌తో పాటు జనం కూడా తరలిరావడంతో ఎన్.హెచ్ 30 ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లతో కిక్కిరిసిపోయింది. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావడంతో మైలవరం పసుపుమయమైంది.

నందిగామలో సౌమ్య నామినేషన్..

నందిగామ : ఉవ్వెత్తున ఎగసిన జనతరంగం, కూటమి బలం, ప్రజాభిమానం నడుమ తంగిరాల సౌమ్య నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నందిగామ టీడీపీ కూటమి అభ్యర్థిగా సౌమ్య సోమవారం నామినేషన్‌ను దాఖలు చేశారు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆమెకు మత పెద్దలు సర్వమత ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. అనంతరం తండ్రి తంగిరాల ప్రభాకరరావు ఘాట్ వద్ద ఆమె నివాళులర్పించారు. రైతుపేట పార్టీ కార్యాలయం నుంచి ఆమె ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరవడంతో పట్టణం కిటకిటలాడింది. ఎండ, ఉక్కపోతను సైతం లెక్క చేయకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక వాహనంపై ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జనసేన కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవిలతో కలిసి ర్యాలీగా బయలు దేరగా.. అభిమానులు అడుగడుగునా పూలవర్షం కురిపించారు. రైతుపేటలో టీడీపీ నాయకుడు మాగంటి పూర్ణచంద్రరావు భారీ బత్తాయి దండను సౌమ్యకు వేసి అభిమానం చాటుకున్నాడు. ముహూర్త సమయానికి ఆమె ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట


భారీ బత్తాయిల దండతో సౌమ్యకు ఘన స్వాగతం

వీరబాబు ఆమెను ప్రతిపాదించారు. సీనియర్ న్యాయవాది యర్రంరెడ్డి బాబూరావు, బీజేపీ నేత తొర్లికొండ సీతారామయ్య, జనసేన నియోజకవర్గ కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవిల సమక్షంలో ఆమె ఆర్డీవో రవీంద్రరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సౌమ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు, బీజేపీ, జనసేన పార్టీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో చేరిన ముస్లిం మైనారిటీ కార్యకర్తలు



మచిలీపట్నం టౌన్ : బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర సోమవారం రాత్రి 28వ డివిజన్‌లో పర్యటించారు. 70 మంది ముస్లిం మైనారిటీ యువకులు టీడీపీలో చేరారు. మచిలీపట్నం డివిజన్ ఇన్‌చార్జి బాజానీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మిస్టరీగా కాంగ్రెస్ నేత అదృశ్యం

- రెండు రాష్ట్రాల పోలీసులకు సవాల్
- ప్రత్యేక బృందాలతో పరిశోధన
- గుర్తు తెలియని మృతదేహాలపై దృష్టి
- డ్రోన్‌తో ఆటవీ ప్రాంతంలో అన్వేషణ
- పలువురు అనుమానితుల విచారణ

జగ్గయ్యపేట, ఏప్రిల్ 22 : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అదృశ్యమైన తెలంగాణా రాష్ట్ర సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య కేసు రెండు రాష్ట్రాల పోలీసులకు సవాల్‌గా మారింది. ఈనెల 18న సూర్యాపేట నుంచి ఒక కేసులో మధ్యవర్తిత్వం కోసం జగ్గయ్యపేట వచ్చిన వడ్డె ఎల్లయ్య (55)ను శ్రీనివాస్ అనే వ్యక్తి డబ్బులు ఇస్తానని తీసుకెళ్లినప్పటి నుంచి కనిపించకపోవటం, అతడిని మధ్యవర్తిత్వానికి తీసుకువచ్చిన అపర్ణ అనే మహిళా తర్వాత కనిపించకపోవటం, వారి ముగ్గురు ఫోన్‌లు స్విచ్ఛాఫ్ కావటం తెలిసిందే. కేసులో జగ్గయ్యపేట, సూర్యాపేట పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. మొదట ఆరు ప్రత్యేక బృందాలు వేయగా ఇప్పుడు 9కి పెంచారు. జగ్గయ్యపేట ఆటవీ ప్రాంతాల్లోను డ్రోన్ కెమెరాలతో గాలిస్తున్నారు. ఎక్కడా వారి ఆచూకీ దొరకలేదు. జగ్గయ్యపేటలో చిల్లకల్లు రోడ్డులో వారు మాట్లాడుకునేందుకు కూర్చున్న ప్రాంతంలో ఆధారాలు సేకరించారు. అపర్ణ అనే మహిళ చేసిన ఫోన్ నెంబర్ నుంచి కాల్‌డేటాను విశ్లేషిస్తున్నారు. అదేవిధంగా అపర్ణను ఎల్లయ్య వద్దకు పంపిన, పరిచయం ఉన్న వ్యక్తులను, అనుమానితులను విచారిస్తున్నారు. సంఘటన జరిగి మూడురోజులు దాటటంతో రెండు రాష్ట్రాల్లో గుర్తు తెలియని మృతదేహాలపై దృష్టి సారించారు. జిల్లాలో దొరికిన మృతదేహాలను గుర్తించే పనిలో ఉన్నారు. నిందితులు తెలివిగా టెక్నాలజీకి సైతం అందకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. కోసం ఎక్కడ ఆనవాళ్లు దొరకకుండా కొత్త సిమ్‌లు వాడినట్టు తెలుస్తున్నది. ఎల్లయ్యపై అనేక కేసులు ఉండటం, ప్రత్యర్థులు, శత్రువుల నుంచి ప్రమాదం పొంచి ఉండటంతో అనేక కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. గుర్తు తెలియని మృతదేహాల్లో ఆచూకి దొరికితే కేసులు చిక్కుముడి వీడే అవకాశం ఉంది. హైదరాబాద్ నుంచి సూర్యాపేట, జగ్గయ్యపేట దాకా విస్తరించిన అదృశ్యం కేసు రెండు రాష్ట్రాల పోలీసులకు తలనొప్పిగా మారింది. తెలంగాణాలో అధికార పార్టీ నేత కావటంతో పోలీసులకు ప్రతిష్టాత్మకంగా మారింది.

మీకెందుకు వేయాలి ఓటు!

- ఉద్యోగాల్లేవు.. ఏమీ లేవు!
- డిగ్రీ చదివి వలంటీరు ఉద్యోగం చేయాలా
- ఉదయభానును నిలదీసిన యువతి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి సామినేని ఉదయభానుకు ప్రచారంలో నిలదీతలు ఎదురవుతున్నాయి. ఆదివారం సాయంత్రం చిల్లకల్లు ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఉదయభానుకు ఓ యువతి నుంచి చేదు అనుభవం ఎదురైంది. ఇంటింటి ప్రచారం చేస్తున్న ఆయన ఓ యువతిని ఓటు అభ్యర్థించగా ఆమె అయన్ను.. 'మీకు దేనికేయాలి సార్ ఓటు అని ప్రశ్నించింది.. తాను డిగ్రీ చదివి, కుటుంబ పోషణకు ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశానని, మీ ఆఫీసు వద్దకు కూడా చాలాసార్లు వచ్చి విన్నవించుకున్నానని.. కానీ ఉద్యోగం రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది.' ఈ ఘటనతో ఖంగుతిన్న అయన వలంటీర్ ఉద్యోగాలు ఉన్నాయిగా అని సమాధానం చెప్పే ప్రయత్నం చేయగా, డిగ్రీ చదువుకున్న నేను వలంటీర్ ఉద్యోగం చేయాలా? అని ఎదురు ప్రశ్నించింది. అందుకు ఉదయభాను అసహనం వ్యక్తం చేస్తూ ఇప్పుడేం చేయమంటావ్.. ఏంకావాలి నీకు.. అని యువతిని అడగ్గా అసలేం చేశారు.. మీరు అని మళ్లీ ప్రశ్నించడంతో అయన ఏం చేయలేదులే అంటూ ముందుకు కదిలారు. ఈ వ్యవహారాన్ని అక్కడి వారు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఉదయభాను పక్కన ఉన్న అనుచరులు వీడియో తీస్తున్న వారిని వీడియో ఆపాలంటూ అ ఫోనున్ లాక్కునే ప్రయత్నం చేశారు.



ఓటు ఆశ.. వేసెయ్ దోశ..!

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి సోమవారం 52వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)తో కలిసి ప్రచారం నిర్వహించారు. కోమలవిలాస్ సెంటర్, చేపల మార్కెట్, శ్రీనివాస మహల్, కొండ ప్రాంతాల్లో పర్యటించారు. కూరగాయల వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అల్పాహార బండి వద్ద దోశలు వేసి ఓట్లు అభ్యర్థించారు.

– వన్‌టౌన్





గుడ్లవల్లేరులో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్

గుడ్లవల్లేరులో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్‌ను ఆర్డీవో పద్మావతి సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో మూడు మోడల్ పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని అందులో భాగంగా గుడ్లవల్లేరు మండలంలో 187/72ను పింక్ పోలింగ్ స్టేషన్ (మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్)గా ఏర్పాటు చేశామన్నారు. 2019 ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ జరిగిందని, ఈసారి 90 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగేట్టు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

– గుడ్లవల్లేరు



ఊరంతా కదిలొచ్చింది..!

కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య నామినేషన్‌కు ఊరంతా కదలింది. సోమవారం సౌమ్య నామినేషన్ సందర్భంగా పట్టణ శివారు హనుమంతుపాలెం కదలి వచ్చింది. ప్రతి ఇంటి నుంచీ యువకులు, మహిళలతో పాటు వృద్ధులు సైతం నందిగామకు తరలివచ్చారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా తరలివచ్చి సౌమ్యకు మద్దతు తెలిపారు. ఊరంతా కలిసికట్టుగా సౌమ్య కోసం తరలిరావడంపై దేశం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – నందిగామ

రాజకీయ ఉద్దండులకు నెలవైన నందిగామ నియోజకవర్గం జిల్లాలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడి నుంచి ఎన్నికైన వసంత నాగేశ్వరరావు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, దేవినేని వెంకట రమణ మంత్రులుగా పనిచేశారు. ఈ నియోజకవర్గంలో కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాలు, నందిగామ మున్సిపాలిటీ సహా మండలంలో సగం గ్రామాలున్నాయి. ఉప ఎన్నికతో కలుపుకుని ఈ నియోజకవర్గంలో 1955 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా, సీపీఐ రెండు సార్లు, కాంగ్రెస్ పార్టీ మూడు సార్లు, జనతా పార్టీ ఒకసారి, వైసీపీ ఒకసారి గెలుపొందగా, టీడీపీ మాత్రం ఎనిమిది సార్లు విజయం సాధించింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత కేవలం 1989, 2019లో మాత్రమే ఓడిపోయింది.



తంగిరాల సౌమ్య
మొండితోక జగన్మోహనరావు




నియోజకవర్గ చరిత్ర

ప్రస్తుతం నందిగామ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న కంచికచర్ల ప్రారంభంలో అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. 1952లో కంచికచర్ల, జగ్గయ్యపేట నియోజకవర్గాలుండేవి. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో రెండు చోట్ల ఓటర్లు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టారు. కంచికచర్ల నుంచి వి.రామారావు, జగ్గయ్యపేట నుంచి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గెలుపొందారు. 1955లో నందిగామ నియోజకవర్గం ఏర్పడింది. జగ్గయ్యపేట నియోజకవర్గం లేదు. కంచికచర్ల, నందిగామ నియోజకవర్గాలుగా ఉన్నాయి. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో కంచికచర్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మాగంటి రామయ్య, నందిగామ నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి పిల్లలమర్రి వెంకటేశ్వర్లు విజయం సాధించారు. 1962 తరువాత కంచికచర్ల నియోజకవర్గం కనుమరుగై జగ్గయ్యపేట ఏర్పడింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో పిల్లలమర్రి మరోసారి విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వసంత నాగేశ్వరరావు నియోజకవర్గంపై తనదైన ముద్ర వేశారు. 1972లో కాంగ్రెస్ నుంచి గెలుపొందగా, తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తరువాత 1983, 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొందారు. మొత్తంగా మూడుసార్లు విజేతగా నిలిచి మంత్రి పదవి చేపట్టారు. ముక్కపాటి వెంకటేశ్వరావు, దేవినేని ఉమా, తంగిరాల ప్రభాకరరావు రెండుసార్లు విజేతలుగా నిలవగా, అడుపుమల్లి సూర్యనారాయణ (1967), దేవినేని వెంకట రమణ (1994), తంగిరాల సౌమ్య (2014), డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు (2019) ఒకసారి చొప్పున గెలుపొందారు. ఇందులో 2009లో దేవినేని ఉమా నియోజకవర్గం మారి మైలవరం నుంచి పోటీ చేసి మంత్రి పదవి చేపట్టారు.

టీడీపీ కంచుకోటలో.. పాగా ఎవరిదో..

- నియోజకవర్గం ఏర్పడ్డాక 8 సార్లు గెలుపొందిన టీడీపీ
- ప్రస్తుత ఎన్నికల బరిలో పాతకాపులే..!

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో మరోసారి పాత కాపులే తలపడుతున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా ఎంఎల్ఏ డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్లు ఖరారయ్యాయి. మొదటిసారి విజయం సాధించిన సౌమ్య రెండోసారి ఓడిపోయారు. మొదటిసారి ఓడిపోయిన మొండితోక రెండోసారి గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తంగిరాల ప్రభాకరరావు, వైసీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్మోహనరావుపై విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో మొత్తం 1,84,061 ఓట్లకు గాను 1,56,260 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లతో కల్పి తంగిరాలకు 78,721 ఓట్లు రాగా, మొండితోకకు 73,509 ఓట్లు వచ్చాయి. తంగిరాలకు 5,212 ఓట్ల మెజార్టీ వచ్చింది. ప్రమాణ స్వీకారం చేయకముందే ప్రభాకరరావు ఆకస్మికంగా మృతిచెందటంతో ఆ ఏడాది సెప్టెంబరులో జరిగిన ఉప ఎన్నికలో తంగిరాల కుమార్తె సౌమ్య భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఉప ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయలేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బోడపాటి బాబూరావుకు 24,921 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యకు 99,748 ఓట్లు వచ్చాయి. రికార్డు స్థాయిలో 74,827 ఓట్ల ఆధిక్యతతో ఆమె గెలుపొందారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా మొండితోక పోటీ చేశారు. జగన్మోహనరావుకు 87,493 ఓట్లు, సౌమ్యకు 76,612 ఓట్లు వచ్చాయి. మొండితోక 10,881 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో వీరిద్దరే మరోసారి తలపడుతున్నారు.



వ్యవసాయమే ప్రధానాధారం

ఈ నియోజకవర్గానికి వ్యవసాయమే ప్రధానం. కృష్ణా, మునేరు, వైరా ఏరు, కట్లేరు ప్రవహిస్తున్నప్పటికీ తాగు, సాగునీటికి ఇంకా ఇబ్బందులు తప్పటం లేదు. వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఎత్తిపోతల పథకాల ద్వారా కొద్దిపాటి భూములకు మాత్రమే సాగు నీరందుతోంది. సాగర్ కాల్వలున్నప్పటికీ ఉపయోగం లేదు. పారిశ్రామికంగా చెప్పుకోదగ్గ అభివృద్ధి లేదు. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలని ఎప్పటి నుంచో రైతులు డిమాండ్ చేస్తున్నా ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. ఇసుక, మెటల్ (కాంక్రీటుకు వినియోగించే కంకర) ఎక్కువగా దోపిడీకి గురవుతున్నాయి తప్పితే స్థానిక సంస్థలకు రావల్సినంత ఆదాయం రావటం లేదు.

నందిగామ విజేతలు వీరే :

సం..	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1955	పిల్లలమర్రి వెంకటేశ్వర్లు	సీపీఐ	కొఠారు వెంకటేశ్వర్లు	కాంగ్రెస్	218
1962	పిల్లలమర్రి వెంకటేశ్వర్లు	సీపీఐ	బండి తిరుపతయ్య	కాంగ్రెస్	1,723
1967	అడుపుమల్లి సూర్యనారాయణ	కాంగ్రెస్	పాటిబండ్ల కోదండరామయ్య	సీపీఐ	7,731
1972	వసంత నాగేశ్వరరావు	కాంగ్రెస్	వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్	స్వతంత్ర	161
1978	ముక్కపాటి వెంకటేశ్వరరావు	జనతా	గుదే మధుసూదనరావు	కాంగ్రెస్-ఐ	7,728
1983	వసంత నాగేశ్వరరావు	టీడీపీ	ముక్కపాటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	10,498
1985	వసంత నాగేశ్వరరావు	టీడీపీ	బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి	కాంగ్రెస్	1,938
1989	ముక్కపాటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	మల్లెల పుల్లయ్యబాబు	టీడీపీ	2,004
1994	దేవినేని వెంకట రమణ	టీడీపీ	బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి	కాంగ్రెస్	10,251
1999	దేవినేని ఉమామహేశ్వరరావు	టీడీపీ	వసంత కృష్ణ ప్రసాద్	కాంగ్రెస్	23,511
2004	దేవినేని ఉమామహేశ్వరరావు	టీడీపీ	వసంత నాగేశ్వరరావు	కాంగ్రెస్	4,285
2009	తంగిరాల ప్రభాకరరావు	టీడీపీ	వేల్పుల పరమేశ్వరరావు	కాంగ్రెస్	5,215
2014	తంగిరాల ప్రభాకరరావు	టీడీపీ	డాక్టర్ మొండితోక జగన్మోహనరావు	వైసీపీ	6,074
(ప్రమాణ స్వీకారం కూడా చేయక ముందే ప్రభాకరరావు మృతిచెందారు. దీంతో ఉప ఎన్నిక జరిగింది)					
2014	తంగిరాల సౌమ్య	టీడీపీ	బోడపాటి బాబూరావు	కాంగ్రెస్	74,827
(ఈ ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయలేదు)					
2019	డాక్టర్ జగన్మోహనరావు	వైసీపీ	తంగిరాల సౌమ్య	టీడీపీ	10,881


మొండిగోడలతో వెక్కిరిస్తున్న షాదీఖానా

- ఉత్తుత్తి హామీలతో ముస్లింలను మోసం చేసిన గుడివాడ ఎమ్మెల్యే
- షాదీఖానా హామీ తూచ్..!
- వదిలేసిన.. కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- ఈద్గా నిర్మాణం ఊసే లేదు..
- వక్ఫ్ ఆస్తులపై కన్ను
- ఐదేళ్ల పాలన తీరిదీ..

మాటల్లో.. కోతలు.. చేతల్లో.. చుక్కలు!



నా మైనార్టీలన్నారు. మోసం చేసి గెలిచారు!
ముస్లిం సోదరులకు ఈద్గా ఏర్పాటు చేస్తామన్నారు.
అధికారం వచ్చాక ఆ ఊసే వదిలేశారు!
మైనార్టీల అభివృద్ధి బాధ్యత నాదేనన్నారు.
గెలిచాక ముఖం చాటేశారు!
షాదీఖానా నిర్మిస్తానన్నారు!
ఐదేళ్లుగా మొండిగోడలే మిగిల్చారు!
అంతేనా.. నిర్మించిన మసీదులకు మళ్లీ బిల్లులు చేసి నిధులు మింగేశారు!
ఈ ఘనకీర్తి ఎవరిదో.. ఈ ఘనాపాటి ఎవరో ఈపాటికే అర్థమై ఉంటుంది కదా! అవును.. ఆయనే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని!

గుడివాడ : మైనార్టీలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తానని గత ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని హామీ ఇచ్చారు. ఆయన మాటను నమ్మి నియోజకవర్గంలోని ముస్లిం ఓటర్లు గంపగుత్తగా వైసీపీని గెలిపించారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు నీటమూటలయ్యాయి.

● జగన్ రివర్స్ దెబ్బకు షాదీఖానా బలి

స్థానిక పాత బైపాస్ రోడ్డులో షాదీఖానా పునఃనిర్మాణానికి గత ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.96 లక్షలు మంజూరు చేశారు. పని ప్రారంభించి 30 శాతం పనులు పూర్తి చేశారు. ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రివర్స్ టెండరింగ్ దెబ్బకు షాదీఖానా బలైంది. స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని ఒత్తిడి మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు 25 శాతం పనులు కూడా పూర్తికాలేదని తప్పుడు నివేదికను సమర్పించి నిర్మాణ పనులు నిలుపుదల చేయించారు. నేటికీ మొండిగోడలు మిగిలేలా చేశారు.

● అనుయాయులకు కాంట్రాక్టు రాలేదనే అక్కసుతో..

పట్టణంలోని బేతవోలులో 3.25 ఎకరాల విస్తీర్ణంలోని ముస్లిం శ్మశానవాటికకు పడమర వైపున గోడను నిర్మించేందుకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.34.70 లక్షలు మంజూరయ్యాయి. జనసేన జిల్లా నాయకుడు పాలంకి సారథిబాబుకు కాంట్రాక్టు దక్కిందనే అక్కసుతో నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాని, వైసీపీ నాయకులు నిలుపుదల చేశారు. స్థానిక ఎమ్మెల్యే నానీని కాదని పనులను ప్రారంభించడం కుదరదని మున్సిపల్ అధికారులు తెల్చి చెప్పేశారు. తాము సూచించిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని హుకుం జారీ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఎమ్మెల్యే నాని చేతులెత్తేశారు.

అసంపూర్తిగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం

వార్డుల్లోని పేదలు చిన్నపాటి ఫంక్షన్‌లు చేసుకోవాలనే తలంపుతో టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని ముస్లిం నివాసిత ప్రాంతాల్లో రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. స్థానిక యానాది కాలనీలోని కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తవ్వగా, 11వ వార్డులోని కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఇంతలో వైసీపీ అధికారంలోకొచ్చింది. ఆ వెంటనే యానాదికాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను సచివాలయంగా మార్చేశారు. 11వ వార్డులోని కమ్యూనిటీ హాల్ 95 శాతం పనులు పూర్తవ్వగా మిగిలిన పని ఆపేశారు.

ఈద్గా హామీ ఏమైంది?

గుడివాడలో ముస్లింలందరూ పండుగ పూట ఒకేచోట నమాజు చేసేలా ఎకరం విస్తీర్ణంలో ఈద్గా ఏర్పాటు చేస్తామని మంత్రిగా ఉన్నప్పుడు నానీ హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైందంటే ఇప్పటికీ సమాధానం లేదు

వక్ఫ్ ఆస్తులపై కన్నేసి

మంత్రిగా నాని గుడివాడ మండలం మల్లాయిపాలెంలోని వక్ఫ్ ఆస్తులపై కన్నేశారు. కారుచౌకగా 100 ఎకరాలను దక్కించుకోవాలని రైతులపై ఒత్తిడి తెచ్చారు. చిన్న, సన్నకారు మైనార్టీ రైతులపై ప్రతాపం చూపేందుకు ప్రయత్నించారు. రైతులు ఎదురు తిరగడంతో వెనక్కి తగ్గారు.

వైసీపీ నాయకులను తరిమికొట్టారు

గుడివాడ మండలం మల్లాయిపాలెంలో మసీదుకు చెందిన పొలాలను అక్రమంగా చెరువుగా తవ్వేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించారు. దీంతో గ్రామంలోని మహిళలు, యువత, వృద్ధులు వైసీపీ నాయకులను తరిమికొట్టారు. మసీదుల అభివృద్ధికి వచ్చిన నిధులపై వైసీపీ నాయకులు కన్నేశారు. బినామీ కాంట్రాక్టర్‌ను రంగంలోకి దించి గత ప్రభుత్వ హయాంలో జరిగిపోయిన పనినే మళ్లీ చేసినట్టు చూపి బిల్లు చేసుకుని రూ.11 లక్షలు జేబులో వేసుకోవాలని ఎమ్మెల్యే నాని అండతో వైసీపీ మైనార్టీ నాయకుడు ప్రయత్నించాడు. టీడీపీ నాయకులు అడ్డుపడి వాస్తవాలను లోకాయుక్త ముందుంచడంతో బిల్లు చెల్లించకుండా నిలుపుదల చేశారు.

సబ్ ఎడిటర్ నుంచి ఎమ్మెల్యేగా ఎదిగి..

- ఆదర్శ రాజకీయవేత్తగా పాటూరు రామయ్య
- నిడుమోలు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక



చల్లపల్లి : ఆయన నీతినిజాయితీలకు నిలువెత్తు రూపం. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడేతత్వం. నిరాడంబర రాజకీయ జీవితానికి నిఖార్సయిన తార్కారణం. ఆయనే ఆదర్శ రాజకీయవేత్త పాటూరు రామయ్య. నిడుమోలు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడుసార్లు వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 1985, 1989, 1994లలో వరుస విజయాలు సాధించిన రామయ్య 1999లో ఓటమి చెందారు. తిరిగి 2004 ఎన్నికల్లో విజయం సాధించారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ అత్యంత సాదాసీదా జీవితాన్నే గడిపేవారు. నెల్లూరు జిల్లా జమ్మలపాలెంలో పాటూరు వెంకయ్య, సుబ్బమ్మ దంపతులకు 1941 అక్టోబరు 9వ తేదీన రామయ్య జన్మించారు. 1965లో మహాలక్ష్మమ్మను వివాహం చేసుకున్నారు. కమ్యూనిస్టు మహానేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శంతో రామయ్య దంపతులు ప్రజాసేవకు పిల్లలు అడ్డుగా ఉంటారని భావించారు. పిల్లలే వద్దనుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారు.

ప్రూఫ్ రీడర్‌గా మొదలై..

1967లో జనశక్తి పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగంలో చేరి తర్వాత ఎడిటోరియల్ బోర్డు సభ్యుడయ్యారు. ఆ తరువాత ప్రజాశక్తి పత్రికకు ఎడిటర్‌గానూ పనిచేశారు. అంచెలంచెలుగా ఎదిగి శాసనసభ్యుని స్థాయికి చేరుకున్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షునిగా, సీపీఎం కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితునిగా పనిచేశారు. సొంత ఇల్లు లేని ఆయన ప్రస్తుతం ఉయ్యూరులోని రోటరీ వృద్ధాశ్రమంలో ఉంటున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 : గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తాగునీటి చెరువుల్లో ఏలూరు కాలువ నీటితో నింపుకోవాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకు మారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోను తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను శుభ్రం చేసి నీటితో నింపాలని సూచించారు. చెరువులు లేని గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. రానున్న ఎన్నికల్లో వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ నిధులతో వాటిని సమకూర్చాలని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.3.80

సైకో పాలనలో యువశక్తి నిర్వీర్యం

పెనమలూరు కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 22 : సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర యువత భవిష్యత్తు నాశనమయిందని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా యువత చేరే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాబ్ క్యాలెండరు పేరుతో యువతను మోసం చేసిన ఒకే ఒక్క ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచి పోతాడని ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ వేసి నిరుద్యోగుల కలలను నెరవేరుస్తామన్నారు. టీడీపీ హయాంలో నిరుద్యోగ యువతకు భృతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర యువత కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, తాతపూడి గణేష్, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో వైసీపీ కార్యకర్తలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్

తాడిగడపలో..



తాడిగడపలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని తాడిగడప టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం తాడిగడప 24వ డివిజన్లో వారు స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. ఐదేళ్ల సైకో పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, నర్రా చంటి, మన్నే రాజేంద్రప్రసాద్, బర్మా శ్రీనివాసరావు, వడుగు సాంబశివరావు, పీతా శ్రీనివాసరావు, ఆలూరి విఠల్‌బాబు, షేక్ నాగుల్‌మీరా, పాండురంగారావు, కొక్కిలిగడ్డ సాంబశివరావు, కొక్కిలిగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు



పోరంకి సాలిపేటలో గ్రామస్తులకు మేనిఫెస్టోను వివరిస్తున్న అనుమోలు

టీడీపీ కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతారని కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ సతీమణి హేమ, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు అన్నారు. సోమవారం యనమలకుదురు, పోరంకి సాలిపేటల్లో జరిగిన పాదయాత్రల్లో వారు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారని, రైతులకు, నిరుద్యోగులకు, కార్మికులకు మేలు జరిగే విధంగా మేనిఫెస్టో రూపకల్పన చేశారని తెలిపారు. వారి వెంట బోడె వైష్ణవి, అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, తాతపూడి గణేష్, బలగం నాగరాజు, పాదాల ప్రభాకర్, మలంపాటి విజయలక్ష్మి, పండుల రజిని, షాహీనా, మొక్కపాటి సత్యనారాయణ, షకీలా, మేకా స్వాతితేజ, దుర్గా భవాని, మేకా సుబ్బారావు, వడ్డి జీవ, గంధం సురేష్, మాదాసు రాము, తిరుమలశెట్టి సుధీర్, బెజవాడ వెంకటేష్, గోగినేని రామారావు, గట్టువాణి, వేమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి కరువు

ఉయ్యూరు : వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి, ఉద్యోగాలు లేక కార్మికులు, యువకులు వలసలు పోవాలిసిన దుస్థితి ఏర్పడిందని టీడీపీ నాయకుడు మీసాల అప్పలనాయుడు ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జనసేన మచిలీటపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి, టీడీపీ పెనమలూరు అసెంబ్లీ అభ్యర్థి బోడె ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఉయ్యూరు పట్టణం 13వ వార్డులో కూటమి నాయకులతో కలసి సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో పాటు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా సంక్షేమం కోసం అమలు చేయనున్న పథకాలను వివరించి గాజు గ్లాసు, సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

కాటూరులో..

రాష్ట్రాభివృద్ధికి టీ డీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ అన్నారు. కూటమి నాయకులతో కలసి సోమవారం కాటూరులో ఇంటింట ప్రచారం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అవసరాన్ని వివరించి గాజుగ్లాసు, సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు, కాటూరు శరత్, వెంకటనారాయణ, పోతురాజు, కాటూరు రవి, రాజు పాల్గొన్నారు.



కాటూరులో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో బోడె వెంకట్రామ్



ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఖాళీ కుండలు

అలంకారప్రాయంగా చలివేంద్రం

●కుండల్లో నీళ్లు పెట్టని నిర్వాహకులు

ఉయ్యూరు, ఏప్రిల్ 22 : ఉయ్యూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన చలివేంద్రం కుండల్లో నీళ్ల లేక అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. వేసవిలో ప్రయాణికుల, ప్రజల దాహార్తి తీర్చాలన్న ఉద్ధేశంతో లక్ష రూపాయల ప్రజాధనంతో ప్రధాన సెంటర్ విజయవాడ బస్టాప్ వద్ద చలివేంద్రం, చలువ పందిరి ఆర్భాటంగా ఇటీవల ప్రారంభించారు. చలివేద్రంలో ఏర్పాటు చేసిన కుండల్లో నీళ్ల ఉంచకపోవడంతో దాహన్ని తీర్చుకునేందుకువచ్చిన వారు ఉస్సు రంటూ తిరిగి వెళుతున్నారు. చలివేంద్రం నిర్వహణ కాంట్రాక్టరుకు అప్పగించిన నేపథ్యంలో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రజోపయోగమైన

ప్రాజెక్టులకు రూపకల్పన జరగాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 22 : ఆధునిక సాంకేతికతతో కూడిన ప్రజోపయోగమైన ప్రాజెక్టులను తయారు చేసి వినియోగంలోకి తేవడం ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులు సామాజిక వికాసం, అభ్యున్నతికి దోహదపడాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ సూచించారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగాధిపతి నవీన్ ఆధ్వర్యంలో ఫైనలియర్ విద్యార్థులకు సోమవారం స్థానిక కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్ పో నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతకు సాంకేతిక నైపుణ్యాలను సమ్మిళితం చేసి రూపొందించిన వివిధరకాల వినూత్న ప్రాజెక్టులను ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, డైరెక్టర్ కుర్రా రాజశే ఖరరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు ఆయా ప్రాజె క్టులను పరిశీలించి, వాటి ఉపయోగాలపై విద్యార్థులనుంచి వివరాలు రాబట్టారు.



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వడ్డే

భూమాతను కాపాడుకుందాం

ప్రపంచ భూ దినోత్సవంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఉయ్యూరు, ఏప్రిల్ 22 : సమస్త జీవకోటి భారాన్ని మోసే భూమి పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తెరగాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ప్రపంచ పృథ్వి (భూమి) దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భూ కాలుష్య నివారణ- పృథ్వి పరిరక్షణ అనే అంశంపై అవగాహనకు ఏర్పాటు చేసిన పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానవ తప్పిదంతో ప్రపంచ వ్యాప్తంగా భూమి కాలుష్య కోరల్లో చిక్కుకుందని, కాలుష్యం నుంచి పరిరక్షించుకోవడం అందరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాసరావు, ట్రెజరర్ వూర కిషోర్‌కుమార్, ప్రతినిధులు దినవహి ప్రసాద్, నెల్లి రాంబాబు, వెల్లంకి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

పెనమలూరు : ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు కళాశాల నుంచి వందడుగుల రోడ్డు వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న భూతాపం, కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించి అంతరించిపోతున్న జీవరాశులను కాపాడుకోవడానికి 2009 నుంచి ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని ప్రోగ్రాం అధికారి కొల్లా నరేంద్ర తెలిపారు.



వీఆర్ సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

230 మందికి దంత పరీక్షలు

ఉయ్యూరు, ఏప్రిల్ 22 : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల, వాకర్స్ అసోసియేషన్, సిద్ధార్థ దంత వైద్యకళాశాల, హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో 230 మందికి దంత పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ప్రొఫెసర్లు డాక్టర్ ధనప్రకాశ్, డాక్టర్ తేజ స్విని, పలువురు హౌస్‌సర్జన్లు వైద్యసేవలందించారు. ప్రిన్సిపాల్ పి శ్రీరామ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కె సత్తార్, కార్యదర్శి పూర్ణ, బాపిరాజు, నూకల సాంబశివరావు, సలీమ్, ఆంజనేయులు పలువురు సభ్యులు పాల్గొని సేవలందించారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

పదిలో రవీంద్ర భారతి విద్యార్థుల ప్రతిభ

గన్నవరం, ఏప్రిల్ 22 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో గన్నవరంలోని రవీంద్ర భారతి విద్యార్థులు ప్రతిభ చాటారు. పన్నెండు మంది విద్యార్థులు 90 శాతంపైగా మార్కులు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. కేవీఎన్ రూప 582 మార్కులు, యు హన్సిత 581 మార్కులతో స్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించారని తెలిపారు. మిగిలిన విద్యార్థులలో ఎండీ పర్వేజ్ 579, జీ రచన 573, సీహెచ్ చంద్రిక 563, కే రాగశ్రీ 562, సీహెచ్ వరుణ్ 557, బీ సంతోష్ 552, ఆర్ లహరి 541, ఐ వర్షిత 521, ఎల్ హెప్సీబా 519, వీ ధనలక్ష్మి 515 మార్కులు సాధించినట్టు తెలిపారు.



రూప (582)



హన్సిత (581)

పెనమలూరు అసెంబ్లీకి

మరో మూడు నామినేషన్లు

పెనమలూరు, ఏప్రిల్ 22 : పెనమలూరు అసెంబ్లీకి సోమవారం మరో మూడు నామినేషన్లు దాఖలయినట్లు ఎన్నికల ఆర్వో రాజు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా పచ్చిపాల కనకదుర్గారావు, గోగం రాములు నామినేషన్లు దాఖలు చేయగా బహుజన్ సమాజ్ పార్టీ నుంచి సోము మహేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు.

వేధిస్తున్న యువకుడిపై కేసు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 22 : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తానని వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్న అదే గ్రామానికి చెందిన యువకుడిపై సోమవారం జంక్షన్ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఆర్జమ్మ తెలిపారు.

టీడీపీతోనే చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 22 : చేతివృత్తిదారులకు సాంకేతికతో కూడిన పరికరాలను అందజేసి చేయూతనిచ్చి ప్రోత్సహించింది టీడీపీయేనని తెలుగు రైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్ అన్నారు. వీరవల్లి శాలివాహన కాలనీలో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో భాగంగా కుండలు తయారు చేసే కార్మికుల కుటుంబాలతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు లబ్ధి చేకురుతుందని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో ఆదరణ పథకం ద్వారా కుండలు చేసేందుకు సహకరించే విద్యుత్ పరికరాలు అందిం చిన విషయాన్ని గుర్తు చేశారు. సాంకేతికను పేదల అభ్యు న్నతికి వాడటం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ సకాలంలో సంక్షేమపథకాలు అందించగల నాయకుడు చంద్రబా బునాయుడని అందుకే టీడీపీకీ మద్దతు పలకాలని కోరారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్‌గుర్తుపై, బందరు పార్లమెంటు జనసేన కూటమి అభ్యర్థి బాలశౌరికి గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో లంక అజయ్‌కుమార్, రాయి మల్లికార్జునరావు, ధర్మవరపు వెంకట్రావు పాల్గొన్నారు.



వీరవల్లి శాలివాహన కాలనీలో ప్రచారం

పది ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల సత్తా

పెనమలూరు, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పెనమలూరు మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. తాడిగడప జడ్పీ స్కూల్ విద్యార్థి కోలా మానస్ ఈశ్వర్ సాయి 573 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, కానూరు జడ్పీ పాఠశాల విద్యార్థి జిడుగు ఆకాష్ 568 , పెనమలూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని మాదు సింధూ 567 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పెనమలూరు పాఠశాలలో 25మంది విద్యార్థులు ఐదువందలకుపైగా మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని తెలిపారు.

కంకిపాడు : పది ఫలితాల్లో కోలవెన్ను జడ్పీ స్కూల్ అగ్రస్థానంలో నిలిచిందని ఎంఈవో ప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండలంలోని పది జిల్లా పరిషత్ పాఠశాలల్లో సుమారు 508 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 359 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 149 మంది విద్యార్థులు ఫేయిల్ అయినట్లు తెలియ జేశారు. కోలవెన్ను పాఠశాల విద్యార్థి పల్లవి 568 మార్కులతో ప్రథమ , కంకిపాడు విద్యార్థి ఎ. వెన్నెల 563 ద్వితీయ, కోలవెన్ను పాఠశాల విద్యార్థి సీహెచ్ సిద్ధార్థ కుమార్ తృతీయ స్థానంలో నిలిచాడని తెలిపారు.

ఉయ్యూరు : పది పరీక్షల్లో ఉయ్యూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని తుమ్మల అఖిల 588 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా అఖిలను పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

గన్నవరం : మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. 76 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 76మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మీ తెలిపారు. ఎ.అరుణ 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా డోలా సాత్విక 576 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ముస్తాబాద జడ్పీ హైస్కూల్‌లో పి.అనిల్ కుమార్ 549 మార్కులు సాధించినట్టు ఎంఈవో కె.రవి కుమార్ తెలిపారు. మండలంలో 76.44 శాతం ఉత్తర్ణులైనట్లు తెలిపారు.

ఉంగుటూరు : పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల బాలికలు తమ సత్తా చాటారు. తేలప్రోలు జడ్పీహైస్కూల్ విద్యార్థినిలు ఎస్.ప్రియతమ సాయి 557, జి.సునీత 554, ఆత్కూరు జడ్పీహైస్కూల్ విద్యార్థిని టి.ధనలక్ష్మి 553 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్టు ఎంఈవో 1, 2లు కె.రవికుమార్, జె.సాంబశివరావు తెలిపారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల వ్యాప్తంగా 804 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వగా 88.93శాతంతో 715 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో రాంబాలసింగ్, సురేష్‌కుమార్ తెలిపారు. బాపులపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సైరాబాను 584 మార్కులతో ప్రథమ, వీరవల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన దినేష్‌చంద్రకు 578, మల్లవల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రియాంక 573మార్కులతో ద్వితీయ, తృతీయస్థానంలో నిలచారని వివరించారు.

టీడీపీలో కళాకారుల చేరిక

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 22 : సెంట్రల్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, కళాకారిణి మద్దాలి సత్యవాణి, తపస్వీ కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు సూర్యదేవర జగన్నాథం తదితర సాంస్కృతిక కళాపీఠం సభ్యులు సోమవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయం లో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మరో వంద మంది... సెంట్రల్ నియోజకవర్గం 62వ డివిజన్‌కు చెందిన 100 మంది సోమవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కృష్ణా

వేతన బకాయిలు కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 : కాంట్రాక్టు కార్మికుల వేతన బకాయిలు, పండుగ బోనస్‌లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకుడు మోదుమూడి రామారావు, ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరరావు, తాడిశెట్టి రామకృష్ణ, అర్జునరావు, సీఐటీయూ నాయకులు సిహెచ్. జయరావు, వై.విజయ, కోటేశ్వరరావు, సిహెచ్.వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.3.80

గుడివాడలో ఆరు, పెడనలో ఆరు నామినేషన్లు


నామినేషన్ దాఖలు చేస్తున్న వెనిగండ్ల సతీమణి సుఖదా

గుడివాడ : గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము తరఫున ఆయన సతీమణి సుఖదా రిటర్నింగ్ అధికారి పి.పద్మావతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కాకరరావు పాల్గొన్నారు. వైసీపీ అభ్యర్థులుగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రెండు సెట్లు, కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) రెండు సెట్లు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి నల్లగంచు వెంకట రాంబాబు(కరెంట్ రాంబాబు), జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి అల్లూరి హేమంత్‌కుమార్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా రేమల్లి నీలాకాంత్ నామినేషన్ దాఖలు చేశారు. **పెడన** : పెడన నియోజకవర్గానికి సోమవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ నామినేషన్ వేయగా, ఆయన భార్య కాగిత శిరీష టీడీపీ తరఫును మరో నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శొంఠి నాగరాజు, బీఎస్పీ అభ్యర్థిగా ఈడే కాశీవిశ్వేశ్వరరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా సేనాపతి గోపీ, రాజులపాటి జమదగ్ని నామినేషన్లు వేశారు.

కాగిత దంపతుల పూజలు



బంటుమిల్లి : పెడన నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ నామినేషన్ వేసేందుకు వెళ్తూ పాశ్వాపురం అంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు నాయకులు, కార్యకర్తలతో గుడికి వెళ్లి . ప్రత్యేక పూజల అనంతరం అర్చక స్వామిచే వేద ఆశీర్వాదం పొందారు. అనంతరం భారీ ర్యాలీగా పెడన తరలివెళ్లారు.

పామర్రులో మూడు

పామర్రు : పామర్రు నియోజకవర్గంలో సోమవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ తరఫున తోట్లవల్లూరు మండల జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహనరెడ్డి ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనిల్ తల్లి కైలే జ్ఞానమణి రెండోసెట్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థిగా బాబురాజేంద్రప్రసాద్ రాయవరపు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీదేవికి అందజేశారు.

మచిలీపట్నంలో బీఎస్పీ అభ్యర్థి బాలాజీ..

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఎస్. బాలాజీ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నామినేషన్ పత్రాలు ఉంచి అభిమానం చాటుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఎన్నికల అధికారి వాణికి నామినేషన్ దాఖలు చేశారు

వెనిగండ్ల పేరిట జంక్షన్ ఆలయంలో పూజలు

గుడివాడ : గుడివాడ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధిగా అభివృద్ధి చెందాలంటే వెనిగండ్ల రామును గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో వెనిగండ్ల పేరిట ఆయన ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో రామును కలిసి స్వామి వారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని అందజేశారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ (చంటి), డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ గుండపనేని శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు పెద్దు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ పేరిట ప్రత్యేక పూజలు

మోపిదేవి : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బుద్ధప్రసాద్ పేరిట పార్టీ నాయకులు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో ప్రతి ఇంటి నుంచి రూ.10 చొప్పున సేకరించిన నగదును సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వద్ద పూజలు జరిపి అవనిగడ్డలో నామినేషన్ వేయనున్న బుద్ధప్రసాద్‌కు అందజేశారు. నడకుదుటి జనార్ధనరావు, మెడబలిమి మల్లిఖార్జునరావు, రావి నాగేశ్వరరావు, వేములపల్లి రవిచంద్ర, కేశాని సురేష్, మాతంగి జనార్ధన్, కేతరాజు శ్రీవల్లి, రావి రత్నగిరి, మండవ పవన్ కుమార్, యార్లగడ్డ పోతురాజు తదితరులు ఉన్నారు.

దివిసీమను అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తాం

● బాలశౌరి, బుద్ధప్రసాద్ ఉద్ఘాటన

అవనిగడ్డ, ఏప్రిల్ 22 : దివిసీమను అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తానమి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నామినేషన్‌కు వెళ్లే సమయంలో అవనిగడ్డ రాజీవ్ గాంధీ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో నియోజకవర్గంలోని రహదారులన్నీ ధ్వంసమయ్యాయని, దోపిడీనే ధ్యేయంగా పాలన సాగిందన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ కేంద్రం నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు తాను నిధులు విడుదల చేయించినా వైసీపీ ప్రభుత్వం కనీసం మ్యాచింగ్ గ్రాంటు కూడా ఇవ్వకపోవటంతో జల్ జీవన్ మిషన్ పనులు ముందుకు కదలలేదన్నారు. ఎదురుమొండి వారధి నిర్మాణానికి నిధులు తీసుకొస్తే కొంత మొత్తాన్ని ఇతర పథకాలకు ప్రభుత్వం మళ్లించిందన్నారు. దీని కారణంగానే వారధి పనులు ప్రారంభం కాలేదని ఆరోపించారు. తనను, మండలి బుద్ధప్రసాద్‌ను గెలిపిస్తే ఎదురుమొండి వారధి నిర్మాణంతోపాటు మచిలీపట్నం - రేపల్లె రైల్వే లైన్ సాధనకు కృషి చేస్తానన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి తిరిగి రాష్ట్రంలో అభివృద్ధిని సాధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. భోగాది రమాదేవి, చిరువోలు బుచ్చిరాజు, జనసేన నేతలు మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషబాబు, రాయపూడి వేణుగోపాలరావు, నేత చిలకలపూడి పాపారావు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

భారీ ర్యాలీలు

కోడూరు : మండలి బుద్ధప్రసాద్ నామినేషన్‌కు భారీగా తరలివెళ్లారు. బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఒడుగు నాగబాబు, పార్టీ శ్రేణులు కొండవీటి సునీత, దొండపాటి శ్రీనివాసరావు, కూరాకుల ప్రసాద్, పూతబోయిన శ్రీనివాసరావు, పూతబోయిన కరుణ కుమార్, వేములపల్లి రాజేష్, కోట రాంబాబు, తోట రాంబాబు, మద్దూరి కాంతారావు, తోట దామోదర్, పిల్లి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. **నాగాయలంక** : బుద్ధప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు వందలాది మంది బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. మెండు లక్ష్మణరావు, మండవ బాలవర్ధిరావు, లకనం నాగాంజనేయులు, సైకం దినేష్, మేడికొండ విజయ్, మత్తి రాజా, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, నాగిడి తాతారావు, రేమాల బాబురావు, బండ్రెడ్డి హరి, తలశిల రామకృష్ణ చౌదరి, చిట్టా అన్నపూర్ణయ్య పాల్గొన్నారు.


కోడూరులో జనసేనలో చేరిన వారితో బుద్ధప్రసాద్, బాలశౌరి


బందరులో వ్యాపారసంస్థలో ప్రచారం చేస్తున్న రవీంద్ర

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కోడూరు : మండలంలోని సాగు, తాగునీరు, రహదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కోడూరు ప్రధాన సెంటర్‌లో బహిరంగ సభలో వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి దుస్థితిని స్వయంగా వీడియో తీసి చూపించినా పట్టించుకోని ముఖ్యమంత్రి జగన్ అని ధ్వజమెత్తారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తీర ప్రాంత భూములు సుమారు నాగు వేల ఎకరాలు బీడుగా మారాయని, పోరాటం చేసిన తనను వైసీపీ పాలకులు గృహ నిర్బంధం చేశారన్నారు.

భారీగా జనసేనలోకి చేరికలు

కోడూరులో వార్డు మెంబర్ దామోర్ల నారాయణ, కడవకొల్లు మల్లిఖార్జునరావు, పూతబోయిన లక్ష్మణరావు, బొడ్డు వెంకన్న, నరహరశెట్టి పద్మారావు ఆధ్వర్యంలో 70 మంది వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్, బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఒడుగు నాగబాబు, కొండవీటి సునీత, దొండపాటి శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, కోట రాంబాబు, పూతబోయిన కరుణ కుమార్, సుంకర లక్ష్మీ, వేములపల్లి రాజేష్, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, యర్రంశెట్టి కనకదుర్గ, కోట రాంబాబు, తోట లక్ష్మణరావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, తోట రాంబాబు, అద్దంకి పాండురంగారావు, బొలిశెట్టి విఠల్ రావు, కొప్పనాతి సత్యనారాయణ, కూరాకుల ప్రసాద్, కూరాకుల చంద్రశేఖర్, అప్పికట్ల రవీంద్ర, ఉప్పాల పోతురాజు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ పాల్గొన్నారు.


వల్లూరుపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మహిళలు

వల్లూరుపాలెంలో మహిళా చైతన్యం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 22 : వర్ల కుమార్ రాజా గెలుపు చంద్రబాబు సీఎం అయ్యేందుకు మలుపు అంటూ వల్లూరుపాలెంలో సర్పంచ్ కొనకాల రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో మహిళలు సోమవారం రాత్రి స్వచ్ఛందంగా ప్రచారం చేపట్టారు. ఉద్యోగాలు రావాలన్నా, రాజధాని నిర్మించాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు సీఎం కావటం ఒక్కటే మార్గమని, పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజాని సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించుకోవాలని ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు చెన్నుపాటి శ్రీధర్, కొనకాల వాసు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలపై దృష్టి సారిస్తాం : కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 : వ్యాపారుల సమస్యలపై దృష్టి సారిస్తామని అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి కోనేరు సెంటర్, క్లాత్ మార్కెట్ ఇతర షాపుల్లో కొల్లు రవీంద్ర ఎన్నికల ప్రచారం చేశారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కార్పొరేటర్ మరకాని సమత కీర్తి, బీజేపీ నాయకులు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు. శారదానగర్, వడ్డిరంగారావు కాలనీలలో టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ పర్యటించారు. గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈడేపల్లిలో టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ ఇంటింటికీ పర్యటించారు.

తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యాలయం ముట్టడి



కొత్తవరం : తాగునీటి సమస్యపై కొత్తవరం గ్రామ ప్రజలు సోమవారం పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. మోటారు రిపేరు కారణంగా తాగునీటి సమస్య వచ్చిందని కార్యదర్శి ఉమామహేశ్వరరావు చెప్పారు. ఇటీవల పదేపదే మోటార్ కాలి పోతుండగా అదనపు మోటార్ ఎందుకు కొనడం లేదని కార్యదర్శి ఉమామహేశ్వరరావును గ్రామస్తులు ప్రశ్నించారు. మోటారు కాలినపుడల్లా వారం రోజులు పైనే నీళ్ల ఇవ్వకుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రజలు నిలదీశారు. మోటారు కొనడానికే బయలుదేరానని, మంగళవారం నుంచి నీటిని గతంలో లాగానే కుళాయిల ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు.

డాక్టర్ బాబుకు ఘననివాళి

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 22 : గుడివాడ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కొసరాజు వెంకటాద్రి చౌదరి (డాక్టర్ బాబు) ఆరో వర్ధంతిని కొసరాజు వెంకటాద్రి చౌదరి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం గుడ్లవల్లేరు లో నిర్వహించారు. డాక్టర్ బాబు విగ్రహానికి గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, కొసరాజు వెంకటాద్రి చౌదరి సేవాసమితి నిర్వాహకుడు కొడాలి రామరాజు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. జంగం మోహనరావు, శాయిన పుష్పావతి, వల్లభనేని వెంకట్రావు, ఈడే మోహన్,కాటూరి కిషోర్, ఏ.రామ్మోహనరావు, తోట మల్లి, బొప్పన శివ ప్రసాద్, కొప్పినేని శేషవేణి, ఎ.శ్రీరామచంద్ర ప్రసాద్, ఎస్వరూప్, చలసాని శ్రీధర్, పొట్లూరి రవి కుమార్, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పోతవరపు వెంకటరావు, వై.పి.సి ప్రసాద్, ఎస్.కె.డి ప్రసాద్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పడవ బోల్తాపడి వ్యక్తి మృతి

పెదపారుపూడి : చేపల చెరువులో పడవ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తమలంపాడులో జరిగింది. తమ్మలంపాడులో జుటూరి నరసింహారావు చేపల చెరువులో మేత వేయటానికి వెళ్లిన వల్లూరి విజయ్ బాబు (21) పడవ బోల్తా పడి చనిపోయినట్లు ఎస్సై జి.రాజు తెలిపారు. బాపులపాడు మండలం కొయ్యూరు గ్రామానికి చెందిన విజయ్‌బాబు గత కొంతకాలంగా జుటూరి నరసింహారావు చెరువుల వద్ద పని చేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పసుపు విత్తనం, గడ్డివాములు దగ్ధం

తోట్లవల్లూరు : భద్రిరాజుపాలెం పోతురాజుగుడి సమీపంలో నిర్లక్ష్యంగా కాల్చిపడేసిన సిగరెట్ వల్ల రూ 1.20 లక్షల విలువ గల 20 పుట్లు పసుపు విత్తనం, రూ 1.50 లక్షల విలువైన 15 ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. మండేపూడి రామిరెడ్డికి చెందిన 20 పుట్లు పసుపు విత్తనం, కన్నా ప్రసాద్, వీరంకి కోటేశ్వరరావు, పొనమాల వీరాంజనేయులు, పొనమాల శ్రీనివాసరావుకి చెందిన 15 ఎకరాల ఐదు వరిగడ్డి వాములు పూర్తిగా దగ్ధమై తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

చిలకలపూడి మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు రూ.లక్ష బహుమతి


చరిష్మ రత్నమణి


బాలనాగలక్ష్మి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 22 : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చిలకలపూడి మున్సిపల్ పాఠశాల విద్యార్థినులు ఇద్దరు 570 మార్కులు సాధించి పూర్వ విద్యార్థుల సంఘం ఇచ్చే లక్ష రూపాయల బహుమతికి అర్హత సాధించారు. ఇద్దరు విద్యార్థులకు ఒకే మార్కులు రావడంతో లక్ష రూపాయలను చెరిసగం అందజేస్తారు. దేవరబోయిన చరిష్మ రత్నమణి 570 మార్కులు, వాలిశెట్టి బాల నాగలక్ష్మి 570 మార్కులు సాధించారు. బందరు మండలం చిన్నాపురం హైస్కూల్ విద్యార్థి ఎల్. లీలావైష్ణవి 576 మార్కులు, తపసిపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని సిరివెళ్ల మేఘన 573 మార్కులతో ప్రతిభను చాటినట్లు ఎంఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

పెడనలో గిరీష్‌మంత్ మహీ

పెడన : పెడన మండలంలోని ఏడు జడ్పీ హైస్కూల్స్ ఒక గురుకుల పాఠశాల నుంచి మొత్తం 447 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా వారిలో 374 మంది విద్యార్థు ఉత్తీర్ణులయ్యారు. తోటమూల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గిరీష్‌మంత్‌మహీ 581 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచింది.

మోపిదేవిలో అరజా నిత్యశ్రీ



మోపిదేవి : వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. . పెదకళ్లేపల్లి ఎస్‌డిఎన్ఎస్‌డిఎస్ పాఠశాల విద్యార్థిని అరజా నిత్యశ్రీ 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది మోపిదేవి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన యన్నంశెట్టి లావణ్య 571 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

కోడూరులో వై.ఉజ్వల



కోడూరు : స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని వై.ఉజ్వల 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఏ.అఖిల్ 584 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించింది.

నాగాయలంకలో కోసూరు శ్రియ



నాగాయలంక : మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థిని కోసూరు శ్రియ 571 మార్కులను సాధించి మండలంలోనే ప్రథమ స్థానం సాధించినట్లు ఎంఈవో ఎ.రామారావు తెలిపారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థిని భవజ్ఞ సాయి



చల్లపల్లి : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో చల్లపల్లి మండలం 96 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎన్టీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థిని కె.భవజ్ఞ సాయి 597 మార్కులు సాధించి చల్లపల్లి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి, ఎంఈవో జిఎన్‌బి.గోపాల్, పి.వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

మొవ్వలో బండారు నిఖిత



కూచిపూడి : మొవ్వ మండలంలో 84శాతం ఫలితాలు సాధించగా, 580 మార్కులతో మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థిని బండారు నిఖిత మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. గుడ్ షప్పర్డ్ కాజ పాఠశాలకు చెందిన మౌనిక 573 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా, 570 మార్కులతో హోలి స్పిరిట్ పాఠశాలకు చెందిన మాధురి తృతీయ స్థానంలో నిలిచింది.

పెదపారుపూడిలో బిందు అమూల్య



పెదపారుపూడి : మండలం పదవ తరగతి పరీక్షల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. వెంట్రప్రగడ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఏ.బిందు అమూల్య 576 మార్కులతో మండలం ఫస్ట్ సాధించిందన్నారు.

పెనమకూరు జడ్పీలో కిరణ్‌కుమార్



తోట్లవల్లూరు : పెనమకూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన మత్తే వెంకట కిరణ్ కుమార్ 578 మార్కులతో మండలంలో ఫస్ట్ సాధించాడు. ఇంటూరి లెలా తన్మయ్ 574 మార్కులతో ద్వితీయ స్థానం, షేక్ అమ్రీన్ జాహ 562 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.

టెన్త్ ప్రతిభావంతులు వీరే

కృత్తివెన్నులో సాయి జాహ్నవి



కృత్తివెన్ను : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో చినగొల్లపాలెం హైస్కూల్‌కు చెందిన జొన్నాల సాయి జాహ్నవి 583 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులందర్నీ గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఘంటసాలలో కేతన జ్యోత్స్న



ఘంటసాల : ఘంటసాల జడ్పీ హైస్కూల్‌లో కేతన జ్యోత్స్న 568 మార్కులు సాధించి మండలం ఫస్ట్ సాధించి నట్లు హెచ్ఎం శ్రీరంగవల్లి తెలిపింది.

గుడ్లవల్లేరులో వను బాలాజీ, తన్మయి




గుడ్లవల్లేరు : మండలం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. అంగలూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. కౌతవరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి వి.వను బాలాజీ 586 ఎ.ఎ. ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని టి.తన్మయి 586 మార్కులు సాధించి మండల ఫస్ట్ సాధించారని ఆయన తెలిపారు.

విశ్వభారతి విద్యార్థి రాహుల్‌కు 595 మార్కులు



గుడివాడ : పదవ తరగతి పరీక్షల్లో విశ్వభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రభంజనం సృష్టించింది. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.రాహుల్ 595/600, టి.బాలహాసిని 592/600, జి.సాయిసత్యరామ్ శరవణ్ 590/600 మార్కులు సాధించారని తెలిపారు. మొత్తం 929 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారని, రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత శాతం సాధించామని పొట్లూరి తెలిపారు.